

సుల్తానాబాద్ పట్టణాభివృద్ధికి నిధులు మంజూరు

సుల్తానాబాద్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, ఇందులో భాగంగా పట్టణ అభివృద్ధికి మరో రూ.15 కోట్లు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు తెలిపారు. మున్సిపల్ శాఖ జారీ చేసిన జీవో 566 కాపీలను శనివారం విలేకరులకు అందజేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సుల్తానాబాద్‌పై సవతి తల్లి ప్రేమ చూపించారని, అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. పట్టణంలో ఇంటర్నల్ రోడ్లు, జెంక్షన్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, విలీన గ్రామాల అభివృద్ధికి ఉపయోగిస్తామన్నారు. నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ నూతన కార్యాలయాన్ని నిర్మించే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

4న వాయుసేనలో చేరేందుకు అవగాహన సదస్సు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): భారత వాయుసేనలో చేరేందుకు ఈ నెల 4న బంధంపల్లిలోని స్వరూప గార్డెన్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. వింగ్ కమాండర్ షేక్ యాకుబ్ అలీ, కమాండింగ్ ఆఫీసర్ తదితరులు పాల్గొంటున్నారన్నారు. అవకాశాలు, పరీక్ష, విధానం, సిలబస్, పూర్తి సెలక్షన్ తదితర అంశాలను వివరిస్తారన్నారు. ఇందులో చేరేందుకు నిరుద్యోగ యువతకు సువర్ణావకాశంగా భావించాలన్నారు. ఉదయం 9 నుంచి జరిగే సదస్సులో 16 నుంచి 21 ఏళ్ల యువతీ, యువకులు ఇంటర్మీడియట్, ఆపైచదువు పూర్తి చేసుకున్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9949725997, 8333044460 సంప్రదించాలని కలెక్టర్‌కు పేర్కొన్నారు.

- అనుమతులు తీసుకోకుండానే టౌన్‌షిప్‌లో ఏడు చోట్ల నిర్మాణాలు
- రూ.26కోట్ల ఫీజుకు డిమాండ్ నోటీసు
- కూల్చివేతకు నోటీసులు ఇచ్చిన రామగుండం మున్సిపల్ కార్పొరేషన్
- డెవలప్‌మెంట్ చార్జీలు మినహాయించాలంటూ ఎన్‌టీపీసీ లేఖ
- సీఎల్‌యూ పేరుతో కాలయాపనలు



ఎన్టీపీసీ, కార్పొరేషన్ మధ్య తెగని పంచాయితీ

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎన్‌టీపీసీకి, రామగుండం నగరపాలక సంస్థకు మధ్య ఏడాదిన్నరగా నిర్మాణాలకు సంబంధించిన పంచాయితీ కొనసాగుతోంది. నవరత్న కంపెనీ అయిన ఎన్‌టీపీసీ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు, మున్సిపల్ చట్టానికి విరుద్ధంగా మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు లేకుండానే టౌన్‌షిప్‌లో నిర్మాణాలు చేయడం వివాదస్పదమైంది. మున్సిపల్ చట్టం 2019 ప్రకారం అనుమతి లేని నిర్మాణాలను నోటీసులు కూల్చి వేసే అధికారం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఉంటుంది. రామగుండం నగరపాలక సంస్థ చాలా నిర్మాణాలను అదే విధంగా తొలగిస్తుంది. ఎన్‌టీపీసీ టౌన్ షిప్‌లో బీ టైపు క్వార్టర్లు, హెచ్‌ఓడీ బంగళాలు, బీ టైపు క్వార్టర్లు, రెస్టారెంట్, కమ్యూనిటీ సెంటర్, వీఐపీ గెస్ట్ హౌస్ తదితర నిర్మాణాలకు అనుమతులు తీసుకోలేదు. వీటితో పాటు బ్యాచ్‌లర్ క్వార్టర్, సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్, సీఐఎస్ఎఫ్ ఆర్మరీ, సీ-1, సీ-2, సీ-3, సీ-4 క్వార్టర్లకు కూడా మొదట అనుమతులు తీసుకోలేదు. దీనిపై ఆంధ్రజ్యోతి 2024ఏప్రిల్‌లో 'రామగుండంలో అనుమతులు లేకుండానే భారీ కట్టడాలు' శీర్షికన కథనం ప్రచురించింది. నగరపాలక సంస్థ ఎన్‌టీపీసీ యాజమాన్యానికి నోటీసులు ఇవ్వడంతో అనుమతులకు దరఖాస్తు చేసింది. రెండు విడుతలుగా రూ.2.41కోట్ల ఫీజు చెల్లించడంతో సీఐఎఫ్ఎఫ్ బ్యారెక్స్, సీఐఎస్ఎఫ్ ఆయుధాగారం, సీ టైపు క్వార్టర్లకు అనుమతులిచ్చింది. మిగతా కట్టడాలకు సంబంధించి రెసిడెన్షియల్ జోన్‌లో లేకపోవడంతో చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ (సీఎల్‌యూ) తీసుకోవాలంటూ నోటీసులు ఇచ్చింది. ఎన్‌టీపీసీ యాజమాన్యం దరఖాస్తులను కార్పొరేషన్ ప్రత్యేకాధికారి అయిన కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. సీఎల్ యూలో డీ టైపునకు సంబంధించి రూ.8.33ఎకరాలు, హెచ్ఓడీ బంగ్లా 7.9ఎకరాలు, వీఐపీ గెస్ట్‌హౌస్ 2.07ఎకరాలు, బీటైపు క్వార్టర్లకు 3.21 ఎకరాలకు సంబంధించి సీఎల్‌యూ ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. గతేడాది ప్రభుత్వానికి ఫైల్ నివేదించగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉంది.

రూ.26కోట్ల ఫీజుకు నోటీసులు

ఎన్‌టీపీసీ యాజమాన్యం ఇప్పటికే నిర్మించిన బీ టైపు, డీ టైపు క్వార్టర్లు, హెచ్ఓడీ బంగ్లా, రెస్టారెంట్లు, కమ్యూనిటీ హాల్ బంగ్లా, వీఐపీ గెస్ట్‌హౌస్‌కు సంబంధించి సుమారు రూ.26కోట్లు నిర్మాణ అనుమతుల ఫీజులు, అపరాధ రుసుములు చెల్లించాలంటూ నగర పాలక సంస్థ ఎన్‌టీపీసీ యాజమాన్యానికి ఈ ఏడాది మేలోనే నోటీసులు ఇచ్చింది. దీనిపై ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం వెలువడలేదు.

ఆగస్టులోనే నిర్మాణాల తొలగింపునకు నోటీసులు

ఎన్‌టీపీసీ యాజమాన్యం నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో ఆగస్టులో నిర్మాణాలను తొలగించాల్సిందిగా కార్పొరేషన్ కమిషనర్ స్పీకింగ్ ఆర్డర్స్ జారీ చేశారు. సాధారణంగా డిమాలిష్ నోటీసులు జారీ అయిన తరువాత నిర్మాణదారుల నుంచి స్పందన రాక పోతే కార్పొరేషనే నిర్మాణాలను తొలగించాల్సి ఉంటుంది. ఎన్‌టీపీసీ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ

(మిగతా 8వ పేజీలో)

ఎన్‌టీపీసీకి ఒక తీరు... మాకొక తీరా...

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకునే సందర్భంలో ప్రజలు ఎన్‌టీపీసీ ఉటంకిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. నిర్మాణ అనుమతులు తీసుకోని ఎన్‌టీ పీసీకి ఒక నీతి, మాకు ఒక నీతా అనే ప్రశ్నలు కూడా టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఎదురవుతున్నాయి.

పాఠశాల అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి : కలెక్టర్



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ శాఖలో వినియోగించని బ్యాంకు ఖాతాలలో నిధులు ఉంటే వాటిని సరి చేసుకోవాలన్నారు. జిల్లాకు చెందిన రూ.4.5 కోట్ల నిధులను ఉపయోగించని ఖాతాల నుంచి ఆర్‌బీఐ వెనక్కి తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం ఉందని, వాటిని మళ్లీ బ్యాంకు ఖాతాలలో తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం వరకు జిల్లాలోని ప్రభుత్వ శాఖల పరిధిలో ఉపయోగించని బ్యాంకు ఖాతాలు ఏమైనా ఉంటే వాటి వివరాలు అందించాలన్నారు. డిసెంబర్ చివరి నాటికి జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో అవసరమైన మౌలిక వస్తువుల పనులు పూర్తి చేసే దిశగా నిధులు మంజూరు చేస్తామన్నారు. కలెక్టరేట్ నుంచి సుమారు 30 కోట్ల నిధులు మంజూరు చేసి పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టామన్నారు. జిల్లాఅధికారి రెండు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ స్కూల్స్‌ను విజయవంతంగా నిర్వహించాలి

ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ప్రీ ప్రైమరీ పాఠశాలలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ టీచర్లకు ఓరియంటేషన్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రీప్రైమరీ టీచర్ల ఎంపికలో పారదర్శకత పాటించామని, మెరిట్ ఆధారంగా టీచర్ల ఎంపిక జరిగిందన్నారు. టీచర్లు చిత్తశుద్ధితో పని చేయాలని, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల కంటే మెరుగ్గా విద్యనందించాలన్నారు. విద్యార్థికి ఏకరూప దుస్తులు, ఆట వస్తువులు, ఇతర పరికరాలు నెల రోజుల్లోగా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. టీచర్లు ఓపిక, ఉత్సాహంతో విద్యాబోధన అందించాలన్నారు. డీఈఓ మాధవి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి షేక్ అధికారులు పాల్గొన్నారు.

సీఎస్‌పీ-1లో విజిలెన్స్ తనిఖీలు

గోదావరిఖని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా జీడీకే సీఎస్‌పీ-1లో మూడు రోజులుగా విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్నట్టు సమాచారం. సీఎస్‌పీ-1లో ఒక బొలెరో క్యాంపర్ విషయంలో విజిలెన్స్ తనిఖీ చేపట్టారని తెలుస్తుంది. 17రోజులుగా షెడ్‌లోనే ఉంటున్న బొలోరా క్యాంపర్‌కు బిల్లు పెట్టారని, ఆ బిల్లుపై సింగరేణి అధికారులు సంతకాలు చేశారని సీఎస్‌పీలో చర్చ జరుగుతుంది. ఈ బిల్లు వెనుక ఓ అధికారి సూత్రధారిగా వ్యవహరించాడని సమాచారం. క్యాంపర్ డ్రైవర్‌కు సదరు అధికారి సహకరిస్తూ17 రోజుల బిల్లును తీసుకున్నట్టు తెలిసింది. క్యాంపర్ నడపకున్నా బిల్లు పొందారని, దీనిపై విజిలెన్స్ అధికారులు తనిఖీ చేస్తునట్టు తెలుస్తోంది. సదరు అధికారిపై గతంలో కూడా పలు ఆరోపణలున్నట్టు తెలిసింది.

ఐటీఐలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్థానిక ఐటీఐలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పాల్గొన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడం వల్ల విధించే శిక్షలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, తెలియని వారు ఇచ్చే పార్సిల్ కవర్లు తీసుకెళ్లడం వల్ల జరిగే అనర్థాలకు విధించే శిక్షలను వివరించారు. ఇలాంటి వాటి జోలికి పోకుండా యువత ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. ఎవరికైనా ఉచిత న్యాయ సహాయం కావాలంటే 15100కి ఫోన్ చేయాలని, ప్రతి న్యాయస్థానంలో ఉచిత న్యాయ సహాయం అందించడానికి న్యాయ సేవాధికార సంస్థ అందుబాటులో ఉంటుందన్నారు. న్యాయవాదులు నుచ్చు శ్రీనివాస్, శరత్ కుమార్, ఝాన్సీ, నరేష్ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అధికారులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న మై భారత్, యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ముఖ్య అతిథులుగా ఎస్ఐ నరేష్ పాల్గొని మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారవద్దని తెలిపారు. వాలీబాల్ విభాగంలో సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ జట్టు ప్రథమ, ఖమ్మర్‌ఖాన్‌పేట వివేకానంద సేవ సమితి ద్వితీయ స్థానంలో నిలిచింది. కబడ్డీలో మంథని జేఎన్టీయూ ప్రథమ, పొత్కపల్లి మల్లికార్జున యూత్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. మహిళా విభాగం కబడ్డీలో జేఎన్‌టీయూ ప్రథమ, ఎంజేపీ ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. సైకాలజిస్టు భూమేష్, ఐటీఐ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఇంచార్జి మహేందర్, వాలీబాల్ కార్యదర్శి రవీందర్, కబడ్డీ కార్యదర్శి కర్ణాకర్, మేరా భారత్ జిల్లా వాలంటరీ మహేష్, శేఖర్, రిషి, రాకేష్, నితిన్, మహేష్, శ్రీను, పాల్గొన్నారు.

పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు షురూ

- తొలి జాబితా నుంచి లబ్ధిదారుల కుదింపు
- వార్డుకు పది నుంచి 15 మంది ఎంపిక

సుల్తానాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులు గ్రామాల్లో కొనసాగుతుండగా పట్టణ ప్రాంతాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో త్వరలోనే సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో శ్రీకారం చుట్టనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఇందిరమ్మ కమిటీల ప్రతినిధులు అయా వార్డుల వారీగా లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టారు. కమిటీలు వార్డుల్లో తిరుగుతూ గృహాలు నిర్మాణం చేసుకోగలిగే స్తోమత ఉన్న లబ్ధిదారులనే ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఒక్కొక్క వార్డుకు వంద నుంచి 200 వరకు లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితా తయారు చేశారు. ప్రస్తుతం ఆ జాబితాను కుదించనున్నారు. వార్డుకు పది నుంచి 15 మందిని ఎంపిక చేయనున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో ప్రాథమిక దశలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. మొదట్లో వార్డుకు 150 నుంచి 200 వరకు ఎంపిక చేసినా, మొదటి దశలో ఇళ్లు కట్టుకునే సామర్థ్యం ఉన్న వారికే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. దీని వల్ల ఒక్కో వార్డులో పది నుంచి 15 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి నిర్మాణం ప్రారంభించనున్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, వార్డు కమిటీ ప్రతినిధులతో ఇటీవల ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఎవరి పేరిట ఇందిరమ్మ ఇళ్ల మంజూరయితే వారు ఆలస్యం చేయకుండా పనులు చేపట్టేలా కమిటీ ప్రతినిధులు లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చైతన్యం చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ క్రమంలో పారదర్శకత పాటిస్తూ ప్రతిదశలో ఫోటోలు తీసి మున్సిపల్ కార్యాలయానికి సమర్పించాలని, పనుల పురోగతిని ప్రజలకు అందుబాటులో ఉంచాలని, వెంటనే బిల్లులు మంజూరు చేయాలని సూచించారు.



ఇందిరమ్మ మోడల్ హౌస్

పేదవారికి అండగా ఇందిరమ్మ ఇల్లు

- విజయరమణారావు, ఎమ్మెల్యే



ఇందిరమ్మ ఇల్లు ప్రతీ పేద కుటుంబానికి గౌరవ ప్రదమైన ఆశ్రయం, మొదటి దశగా సుల్తానాబాద్‌లో కొందరికి ఇండ్లు మంజూరు చేశాం. దశలవారిగా లబ్ధిదారులందరికి ఇండ్లు మంజూరు చేస్తాం. ఇందులో ఎవరు ఆందోళన చెందవద్దు. సకాలంలో ఇండ్లు నిర్మించుకుని ప్రభుత్వం సాయం పొందాలి.

ఇందిరమ్మ ఇండ్ల కోసం 1500 దరఖాస్తులు

- రమేష్, మున్సిపల్ కమిషనర్



ఇందిరమ్మ పథకం కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు 1500 వచ్చాయి. వీటిలో 900 మందిని అర్హులను ఎంపిక చేశాం. ఈ జాబితా నుంచి తొలి దశలో 205 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం. ఈ మేరకు ప్రతి వార్డులోని ఇందిరమ్మ కమిటీల ప్రతినిధులు వీరి పేర్లను ఎంపిక చేసి మున్సిపాలిటీకి ఇవ్వడంతో ఎమ్మెల్యే సిఫారసు మేరకు జాబితాను హౌసింగ్ పీడీ ద్వారా కలెక్టర్‌కు వెళుతుంది. కలెక్టర్ ద్వారా లబ్ధిదారులకు ప్రొసీడింగ్ జారీ చేసి తద్వారా ముగ్గులు పోసే కార్యక్రమం చేపడుతాం. మరో వారం రోజుల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది.

విద్యార్థులకు పొదుపు పాఠాలు

- రచ్చపల్లి పాఠశాలలో కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు

7

ఎన్‌టీపీసీ అభివృద్ధిలో వెండర్ల పాత్ర కీలకం



ప్రసంగిస్తున్న ఈడీ చందన్ కుమార్ సామంత

జ్యోతినగర్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ సంస్థ అభివృద్ధిలో వెండర్ల పాత్ర కీలకమని రామగుండం ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. శనివారం ఎన్‌టీపీసీ మిలినియం హాల్‌లో జరిగిన ఎస్సీ, ఎస్టీ మహిళా వెండర్ డెవలప్‌మెంట్ మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ సంస్థ అవసరాలకు అనుగుణంగా పలు రకాల మెటీరియల్‌ను కొనుగోలు చేయడం, వివిధ రకాల సేవలను పొందే విషయంలో ఖచ్చితమైన నియమాలను పాటిస్తుందన్నారు. ఈ విషయంలో వెండర్లు సమర్థంగా పని చేయాలన్నారు. రక్షణ, నాణ్యత, నిర్ణీత సమయాల్లో ప్రొక్యూర్ చేయడంలో ఎన్టీపీసీ ఖచ్చితంగా వ్యవహరిస్తుందన్నారు. చిన్నతరహా పరిశ్రమల పరిధిలోకి వచ్చే వెండర్లకు ఎన్టీపీసీ సంస్థ చేయూతనందిస్తుందని ఈడీ చందన్‌కుమార్ హామీ ఇచ్చారు. జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు, ఎంఎస్ఎంఈ విభాగాల అధికారులు, పరిశ్రమలకు చెందిన అనుబంధ సంఘాల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ మహిళా వెండర్లు పాల్గొన్నారు.

పది పరీక్ష సెంటర్ల ఏర్పాట్లలో అధికారుల ఇష్టారాజ్యం

- దూరంగా ఉన్న పాఠశాల కేటాయింపు
- దశాబ్దాలుగా నడుస్తున్న సెంటర్ల తొలగింపు

మంథని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణంలో పదో తరగతి వార్షిక పరీక్షా కేంద్రాల ఏర్పాటులో విద్యాశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అందుబాటులో, సౌకర్యాలు ఉన్న పాఠశాలలను అధికారులు విస్మరించి పట్టణ శివారులో ఉన్న పాఠశాలల్లో గతేడాదిగా పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తుండటంతో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు ఇక్కట్లకు గురవుతున్నారు. 2026 మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు సైతం ఇవే కేంద్రాలను ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ సెంటర్లలో దాదాపు యాభై ఏళ్ళుగా పదో తరగతి పరీక్ష కేంద్రాలు నిర్వహించారు. గతేడాది నుంచి విద్యా శాఖ అధికారులు పట్టణ శివారులో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ లో సెంటర్లను ఏర్పాటు చేస్తుండటం పై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



ఈ రెండు సెంటర్లు పట్టణ శివారులో ఉండటంతో సరైన రవాణా సౌకర్యం లేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. కొంత మందికి సకాలంలో అడ్రస్ దొరకక, వివిధ గ్రామాల నుంచి వచ్చే వారికి కనీసం ఆటో సదుపాయం లేక నానా అవస్థలు పడుతున్నారు. సెంటర్ల వద్ద కనీసం తాగునీరు, తినుబండాలు దొరకని, సమయం ముగిసే వరకు వేచి ఉండటానికి స్థలం లేని దుస్థితి ఉంది. విద్యా శాఖ అధికారులు ఈ సెంటర్లను కేటాయించడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న హైస్కల్, గర్ల్స్ హైస్కూల్ సెంటర్లను పక్కన పెట్టి గురుకుల పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలను ఎగ్జామ్స్ సెంటర్లుగా కేటాయించడంపై అందరూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందుబాటులో ఉన్న పాఠశాలలో పరీక్ష సెంటర్లు కేటాయించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను పలువురు కోరుతున్నారు.

జీఎం కాలనీ ఆలయంలో చోరీ

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం కాలనీలోని హనుమాన్ దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి అందులోని నగదు, కానుకలను ఎత్తుకెళ్లారు. ఆలయకమిటీ నిర్వాహకులు శనివారం ఉదయం విషయాన్ని గమనించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ పోలీసులు, క్లూస్ టీమ్ ఘటన స్థలంలో పరిశీలించారు. కాగా ఆలయంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో చోరీకి సంబంధించిన ఆధారాలు లభించలేదు. గతంలో ఇదే ఆలయంలో హుండీ చోరీ జరిగింది. రెండోసారి చోరీ జరుగడంతో పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ కమిటీకి సూచించారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో..

ఎండపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి రేణుకఎల్లమ్మ తల్లి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగుల గొట్టి దొంగతనం చేశారు. హుండీలోని రూ.50వేల విలువైన పుస్తె, మట్టెలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని బసంత్‌నగర్ ఎస్‌ఐ శ్రీధర్, ఎండోమెంట్ అధికారులు శరత్, శ్రీనివాస్ పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయి పట్టివేత

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సంజయ్‌గాంధీనగర్ వాటర్ ట్యాంకుసమీపంలో శనివారం తప్పట్ల సందీప్ అలియాస్ బబ్లూ అనేవ్యక్తి నుంచి 135 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఎస్‌ఐ రమేష్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా వాటర్ ట్యాంకుగేట్ ఎదురుగా సందీప్ అనుమానాస్పదంగా తచ్చాడుతూ కనిపించాడు. అతడిని విచారణ చేయగా గంజాయి దొరికినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- గత ప్రభుత్వ హయాంలో కొంత పరిహారం, పట్టాలు పంపిణీ
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే నిర్వాసితుల ఆశలు



పరిహారం కోసం నిరీక్షణ

వేములవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): : మధ్యమానేరు నిర్వాసితులు పరిహారం కోసం పదిహేనేళ్లుగా నిరీక్షిస్తున్నారు. మధ్యమానేరు జలాశయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 11గ్రామాలు ముంపు గ్రామాలుగా ప్రకటించారు. బోయినపల్లి, వేములవాడ మండలాల్లోని ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతలఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి, కొదురుపాక, నీలోజిపల్లి, వర్దవెల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 2008లో ఆయా గ్రామాల్లో 10683 కుటుంబాలు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించి గెజిట్ ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రెండు గుంటల స్థలంతో పాటుగా వృత్తి ఆధారంగా పరిహారం చెల్లించేందుకు నిర్ణయించారు. నిర్వాసితులకు 2010 నుంచి పరిహారం చెల్లించడం ప్రారంభించారు. 10683 కుటుంబాలకు 10044 కుటుంబాలకు పరిహారం చెల్లించారు. మిగతా 639 కుటుంబాల్లో 219 కుటుంబాలకు చెందిన వారి సంతకాలను అధికారులు సేకరించి బడ్జెట్ కోసం రూ.20.22 కోట్లతో నివేదికను ప్రభుత్వానికి అందించారు. మిగిలిన 420 కుటుంబాల్లో కొందరు కోర్టును ఆశ్రయించగా, మరికొందరు వృత్తి మార్పులు తప్పులుగా పడటంతో పాటు వివిధ కారణాలతో పరిహారం తీసుకోలేదు. వీరి కోసం మరో రూ.30.61 కోట్లు చెల్లించాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. గత ప్రభుత్వం విడతల వారీగా నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తూ 10 సంవత్సరాలు గడిచినా పూర్తిస్థాయిలో నిర్వాసితులకు పరిహారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై గంపెడు ఆశతో ఉన్నామని నిర్వాసితులు చెబుతున్నారు.

ఇంకా అందాల్సిన పరిహారం..

మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురవుతున్న నిర్వాసిత యువతీయువకులకు ఒక కటాఫ్ డేట్‌తో ప్రతి ఒక్కరికి రూ.2 లక్షల పరిహారం అందించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ముంపు గ్రామాల్లో మొత్తం 3917మంది యువతను గుర్తించారు. అందులో యువతులు మొత్తం 2303 మందిని గుర్తించి, 1879 మందికి రూ.2లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. ఇంకా 335 మంది యువతుల వద్ద సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. మిగతా 89మంది యువతుల సంతకాలు మాత్రమే సేకరించారు, వారికి ఇంకా పరిహారం చెల్లించాల్సి ఉంది. 1614 మంది యువకులను గుర్తించగా, 1537 మందికి పరిహారం చెల్లించగా, 28 మంది యువకుల సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం నివేదికను ప్రభుత్వానికి పంపించారు. మిగిలిన 49 మంది యువకులు వివిధ కారణాలతో పరిహారం తీసుకోవడం లేదు. వారికి ఇంకా చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి..

- గుండెకార్ల దేవయ్య, ఆరెపల్లి



వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామం మాది. మా ఇల్లు ముంపులో పోయింది. అధికారులు వచ్చి దరఖాస్తులు తీసుకువెళ్లారు. నాలుగు సంవత్సరాల క్రితం నోటిఫికేషన్ పూర్తి అయింది. ఇప్పటి వరకు నాకు ఇంటి పరిహారం అందలేదు. ప్రభుత్వానికి నివేదిక పంపించామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

నిర్వాసితులపై దృష్టి సారించాలి..

- జింక శ్రీధర్, సంకెపల్లి



సంకెపల్లి గ్రామంలో గతంలో కొన్ని ఇళ్లను మాత్రమే ముంపునకు తీసుకున్నారు. తరువాత మిడ్‌మానేరు జలాశయం కెపాసిటీ పెంచిన తరువాత వాటర్ ఎఫ్‌టీఎల్‌ను దాటి రావడంతో పూర్తి ముంపు గ్రామంగా ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో పరిహారం, పట్టాలు వచ్చాయి. గ్రామంలో ఇంకా మిగిలిన 44 ఇళ్లకు పరిహారం రావాల్సి ఉంది. నోటిఫికేషన్ పూర్తి అయినప్పటికి పరిహారంలో ఆలస్యం అవుతోంది. ప్రభుత్వం త్వరగా పరిహారం అందించాలి.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 14మందికి జైలుశిక్ష

- 57 మందికి జరిమానాలు



మందు బాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

వేములవాడ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 14మందికి జైలు శిక్షపడగా, 57మందికి జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 14రోజులుగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 71 మంది పట్టుబడ్డారు. వీరందరినీ వేములవాడ పోలీసులు శనివారం కోర్టులో ప్రవేశపెట్టగా 14 మందికి జైలుశిక్ష, 57 మందికి జరిమానాలు విధిస్తూ వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించారు. ఇందులో 10 మందికి రెండు రోజుల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు జరిమానా విధించారు. ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధించారు. ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. 49మందికి ఒక్కొక్కరికి రూ.1300 చొప్పున జరిమానా విధించారు. 8మందికి ఒక్కొక్కరికి రూ.2500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగిన యువకుడు

- చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్‌క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన మాదిరి సతీష్‌కుమార్(39) అనే యువకుడు మద్యం మత్తులో పురుగుల మందుతాగగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్‌కుమార్ కొంత కాలంగా మద్యంకు బానిసగామారాడు. ఈక్రమంలో అక్టోబరు 18న మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య, ఇతర కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడు సతీష్‌కుమార్ భార్య అక్షయ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థల వివాదంలో తనకు అన్యాయం చేస్తున్నారని మనస్థాపం చెందిన వృద్ధురాలు ఈసరియాదవ్వ పురుగుల మందు తాగింది. ఈ సంఘటన వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని వృద్ధురాలు యాదవ్వ, క్యారం మంజుల మధ్య కొంతకాలంగా స్థలవివాదం కొనసాగుతోంది. మంజుల న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలు పొందిన ఆమె స్థలంలో ఇంటి ప్రహరీ గోడ నిర్మాణ పనులను ప్రారంభించింది. ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. తన స్థలంలో నిర్మాణం చేపడుతున్నారని యాదవ్వ అడ్డుతగిలింది. ఇరువర్గాల నడుమ వాగ్వావాదం చోటుచేసుకుంది. తనకు అన్యాయం చేస్తున్నారని వృద్ధురాలు యాదవ్వ పురుగుల మందుతాగింది. పోలీసులు పురుగుల మందు డబ్బాను లాక్కొని అపస్మారక స్థితిలోకి ఉన్న యాదవ్వను మొదట ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి సిరిసిల్లకు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఎస్‌ఐ లక్ష్మణ్‌ను సంప్రదించగా ఇంటి స్థల విషయంలో మంజుల కోర్టు ఉత్తర్వుల ప్రకారం పనులను చేపట్టారని పేర్కొన్నారు. గొడవలు చోటు చేసుకోకుండా బందోబస్తు చర్యలు తీసుకున్నామనిచెప్పారు. వృద్ధురాలు యాదవ్వ ఆత్మహత్యకు యత్నించగా, అక్కడే ఉన్న తమ సిబ్బంది అడ్డుకుని పోలీసువాహనంలో ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

సిరిసిల్లలో ముగ్గురి అరెస్ట్

- తల్వార్‌లతో శాంతిభద్రతలకు విఘాతం

సిరిసిల్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తల్వార్‌లతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన ముగ్గురు వ్యక్తులను అరెస్టుచేసినట్లు సిరిసిల్ల టౌన్‌సీఐ కృష్ణ తెలిపారు. పట్టణంలోని సుందరయ్య నగర్ సిక్‌వాడీకి చెందిన బురాని గోపాల్‌సింగ్, బురాని నర్సింహసింగ్, రాజేష్‌సింగ్‌లు తల్వార్లు పట్టుకుని అక్టోబరు 8వ తేదీన రోడ్డుమీదికి వచ్చి భయం కరంగా అరుస్తూ వారిలోవారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారని తెలిపారు. చుట్టపక్కల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రజాశాంతికి భంగం కలిగించారని, ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



దాడులు చేసుకున్న వారిని అరెస్ట్ చేసిన పోలీసులు

స్కూటీ డిక్కీలోంచి నగదు చోరీ

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలోని వైష్ణవి బేకరీ ఎదుట పార్కింగ్‌చేసిన స్కూటీనుంచి శనివారం గుర్తుతెలియని వ్యక్తులు రూ.50వేలను ఎత్తుకెళ్లారు. ప్రభుత్వజనరల్ ఆసుపత్రిలో నర్సింగ్‌ఆఫీసర్‌గా పనిచేస్తున్న అంజలి మున్సిపల్‌ఆఫీస్ ఎస్‌బీఐఏటీఎంలో నగదు తీసుకుని స్కూటీడిక్కిలో పెట్టుకున్నారు. మార్కండేయ కాలనీలోని బేకరీవద్దకువెళ్లి కొనుగోలు చేస్తుండగా బైక్‌పైవచ్చిన ఇద్దరు స్కూటీడిక్కి తాళం తీసి రూ.50వేలు ఎత్తుకెళ్లారు. ఈఘటన సీసీ కెమెరాల్లో రికార్డయింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ఘటన స్థలానికిచేరుకుని విచారణ జరుపుతున్నారు. ఎస్‌బీఐ ఏటీఎంవద్దనుంచే దొంగలు అంజలిని ఫాలో అయినట్లు తెలుస్తుంది. అదనుకోసం చూసి సొమ్ముఎత్తుకెళ్లారు. సీసీఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ పట్టివేత

వేములవాడ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ పరిధిలోని తిప్పాపూర్ గ్రామంలో ద్విచక్రవాహనాలను దొంగిలించే యత్నంలో దొంగ గ్రామ యువకులకు దొరికాడు. శనివారం రాత్రి తిప్పాపూర్‌లో రెండు ద్విచక్రవాహనాలను దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని గ్రామ యువకులు వెంటపడి పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

- యువతికి తీవ్ర గాయాలు



బస్సు కింద ద్విచక్రవాహనం

మల్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని సాయిబాబా గుడి సమీపంలో శనివారం ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పెంచాల శృతి అనే యువతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మల్యాల మండలం తాటిపల్లికి చెందిన పెంచాల శృతి ద్విచక్రవాహనంపై మల్యాలలో టిఫిన్స్ తీసుకొని తిరిగి తాటిపల్లికి వెళ్తుండగా జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీబస్సు ఢీకొంది. దీంతో శృతి తలకు తీవ్రగాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. బాధితురాలి తండ్రి పంబాల సురేశ్ ఫిర్యాదు ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డీసీఎం వ్యాన్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

శంకరపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామశివారులో డీసీఎం వ్యాన్‌ను ఆర్టీసీబస్సు వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ మొలంగూర్ శివారులో స్పీడ్‌బ్రేకర్ వద్ద డ్రైవర్ సడన్ బ్రేక్‌వేశాడు. దీంతో వ్యాన్‌వెనక వస్తున్న కరీంనగర్-1 డిపోకు చెందిన ఆర్టీసీబస్సు వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సుపాక్షింగా ధ్వంసమైంది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ

- ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అయ్యప్ప కాలనీవద్ద జాతీయరహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడెపు జశ్వంత్‌రెడ్డి తనస్నేహితుడు సాయిచరణ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై కరీంనగర్‌నుంచి సింగాపూర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో కేశవపట్నంలోని అయ్యప్పకాలనీ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో జశ్వంత్‌రెడ్డి కాలువిరగగా, తలకు బలమైన గాయమైంది. స్థానికులు అతన్ని 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డుపై పడిన రేషన్ బియ్యం బస్తాలు



రోడ్డుపైన రేషన్ బియ్యం బస్తాలు

మార్కండేయకాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై బుగ్గ రైల్వేబ్రిడ్జి సమీపంలో శని వారం రేషన్‌బియ్యం బస్తా లు తరలిస్తున్న లారీ నుంచి పది బస్తాల వరకు కింద పడ్డాయి. పెద్దపల్లి ఎంఎల్‌సీ గోడౌన్‌నుంచి ఎన్‌టీపీసీ ప్రాంత రేషన్ షాపులకు వస్తున్న లారీలో బస్తాలను సరిగా లోడ్ చేయకపోవడంతో కొన్ని బస్తాలు కిందపడ్డాయి. దీంతో బియ్యం రోడ్డుపై పడ్డాయి. లారీడ్రైవర్ కొద్దిదూరం వరకు గమనించలేదు. వెనుక వస్తున్న ప్రయాణికులు లారీడ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన తిరిగి వచ్చి బస్తాలను తిరిగి లారీలో లోడ్ చేసుకున్నాడు.



స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు



రాజన్న సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు



కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురిక్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. అభిషేకాది పూజలు, స్వామి వారల నిత్యకల్యాణం జరిపించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు ఆంజనేయస్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామివారలకు ఆలయ వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ముఖ్యఅర్చకులు సీహెచ్ రమణాచార్యా, నరసింహమూర్తి, అర్చకులు నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో..

వేములవాడ టౌన్: వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించారు. శనివారం సాయంత్రం భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏఈవో శ్రవణ్ కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా సుహాసినీల ఆధ్వర్యంలో దీపాలు వెలిగించగా, ఆలయ అర్చకుల చేతుల మీదుగా వారికి వాయనం పసుపుకుంకుమ, అక్షింతలు, గాజులు, స్వామివారి ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో అశోక్, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్, జూనియర్ అసిస్టెంట్ కూరగాయల శ్రీనివాస్, సింహాచారి, ఆలయ అర్చకులు, వేదపండితులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం వేలాదిగాభక్తులు దర్శించుకున్నారు. కార్తీక మాసం కావడంతో కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందుగల రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించారు. రాత్రివేళల్లో దేవస్థానం తరుపున దీపోత్సవం నిర్వహించారు. కాగా శనివారం జగిత్యాల మొదటి అదనపు సెషన్స్ న్యాయమూర్తి నారాయణ అంజన్నను దర్శించుకున్నారు.

నేడు సాట్ 'క్యూ' ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం, ఉన్నత విద్య అవకాశాలను విస్తరించడమే లక్ష్యంగా ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రత్యేక ప్రతిభా పరీక్ష సాట్ క్యూ ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్ ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీలోని ఎస్సార్ ఎడ్యు సెంటర్‌లో శనివారం సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఇంటర్మీడియట్‌లో చేరబోయే పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీ ఎస్సార్ ఎడ్యు సెంటర్ కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించే ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10వ తరగతి స్థాయిలో మ్యాథ్స్ ఫిజిక్స్ కెమిస్ట్రీ సిలబస్‌లో మొత్తం 75 ప్రశ్నలు (ప్రతి సబ్జెక్టుకు 25 చొప్పున) ఉంటాయని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు, 100 శాతం స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశంతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ ప్రవేశం పొందే ఎంపీసీ స్ట్రీమ్, జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ (ఫోకస్ ప్రైమ్/ఫోకస్ ప్లస్/ఫోకస్/స్పార్క్/టైటన్) బైపీసీ స్ట్రీమ్ నీట్, ఎంసెట్ (ఫోకస్ ప్రైమ్/టైటన్) కోర్సులకు అర్హులని తెలిపారు. విద్యార్థులు పరీక్ష నమోదు కోసం సమీపంలోని ఎస్సార్ బ్రాంచ్‌ను లేదా 9642117378, 9154989356, 8886287456, 9154854700, 9642117330, 9642117830, 9642114698 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి

పతకాలు సాధించిన సైనిక్ స్కూల్ విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎస్‌జీఎఫ్ అండర్-19 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ విద్యార్థులు పతకాలను గెల్చుకున్నారు. 400మీటర్ల రన్నింగ్‌లో హోమ్‌రాజు గోల్డ్ మెడల్, అచల్ సిల్వర్‌మెడల్, లాంగ్‌జంప్‌లో గణేష్ గోల్డ్‌మెడల్, రన్నింగ్‌లో జె రోషన్ సిల్వర్‌మెడల్ గెల్చుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను, పీఈటీ సుమన్‌ను డైరెక్టర్ కల్నల్ రాజాదత్త, ప్రిన్సిపాల్ వి లింగయ్య, ఎస్‌వీపీ శ్రీనివాస్, జేవీపీ ప్రమోద్ రాజు అభినందించారు.

కడెం ప్రాజెక్టులో దూకి ఉపాధ్యాయుడి బలవన్మరణం



రాజశేఖర్(ఫైల్)

కడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టులో దూకి ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లిజిల్లా జూలపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుంట్ల రాజశేఖర్ రెడ్డి శనివారం వివాహ విందుకు వచ్చి ప్రాజెక్టులో దూకాడు. గమనించిన ఇరిగేషన్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న కడెం ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఎన్‌టీపీసీ కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రశాంత్ నగర్‌లో నివాసముండే ఎన్‌టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు దాసరి రాజ్‌కుమార్ (36) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజ్‌కుమార్ భార్య స్రవంతి ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తుంది. శుక్రవారం సాయంత్రం ఆమె ఇంటికి వచ్చేసరికి రాజ్‌కుమార్ అపస్మారక స్థితిలో ఉండడం, పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడంతో ఆమె రాజ్‌కుమార్ తండ్రి చంద్రయ్యకు ఫోన్‌చేసి తెలిపింది. రాజ్‌కుమార్‌ను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని చంద్రయ్య శనివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

నేడు ఐఎంఏ రాష్ట్ర సదస్సు

● ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి శ్రీధర్‌బాబు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర సదస్సును ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ ఛైర్మెన్ డాక్టర్ పి కిషన్ తెలిపారు. శనివారం నగరంలోని ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకేంద్రంలోని వీ కన్వేన్షన్‌లో సదస్సును నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు ఎదుర్కొం టున్న సమస్యలు, పేషంట్లకు అందించే అధునాతన వైద్యంపై సీనియర్ వైద్యులు మాట్లాడుతారని తెలిపారు. ఉన్నత ప్రమాణా లతో పేషంట్లకు ఎలాంటి వైద్యం అందించాలనే అంశాలపై చర్చించ నున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ఐఎంఏ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఇలాంటి సదస్సులు నేటితరం వైద్యులతో పాటు, ఇతర సీనియర్‌వైద్యులకు ఎంతగానో ఉపయోగపడతాయ న్నారు. సమావేశంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ విజేందర్‌రెడ్డి, కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ శైలజ, కార్యదర్శి డాక్టర్ మహేశ్‌బాబు, కోశాధికారి డాక్టర్ నీలిమ, మాజీ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, డాక్టర్ వసంత్‌రావు, మాజీ కోశాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించు కుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పదకొండవ రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంట రాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపారాయణ దారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నది వద్ద విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపండితులు ముఖ్యఅర్చకులు సీహెచ్ రమణాచార్యా, నంబి నరసింహమూర్తి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



- రచ్చపల్లి పాఠశాలలో కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు
- జంక్ ఫుడ్ నిషేధంతో పొదుపు చేస్తున్న విద్యార్థులు
- లంచ్ టైంలో బ్యాంక్ నిర్వహణ

ధర్మారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాలలో విద్యార్థులు పొదుపు పాఠాలు నేర్చుకుం టున్నారు. చిరుతిండి కోసం తెచ్చుకున్న నగదును కిడ్డీ బ్యాంక్ పేరుతో జమ చేసుకుంటూ.... లెక్కాపత్రాలు చూసుకుంటూ... ఆర్థిక పాఠాల వైపు అడుగులు వేస్తున్నారు.

ఆటాపాటలతో విద్యనందిస్తూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల గుర్తింపు తెచ్చుకొంది. పాఠశాలకు వచ్చే విద్యార్థులు రోజూ లంచ్ టైంలో బయట ఏదో ఒక చిరుతిండి కొనుగోలు చేస్తారు. అందుకు ఐదు నుంచి పది రూపాయలు ఖర్చు చేస్తారు. పాఠశాలలో జంక్ ఫుడ్ నిషేధంతో రోజు తెచ్చుకునే చిల్లర డబ్బులు ఖర్చు కాకుండా విద్యార్థులు కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు చేసి అందులో జమ చేసుకుంటున్నారు. ఇందుకోసం కిడ్డీ బ్యాంక్ పేరిట విద్యార్థులు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో ఒకరు మేనేజర్ గా వ్యవహరిస్తూ ఉండగా మరొకరు క్లర్క్‌గా ఉన్నారు. ఈ కిడ్డీ బ్యాంక్ కేవలం లంచ్ అవర్లో మాత్రమే నిర్వహిస్తారు. విద్యా ర్థులు తెచ్చుకున్న డబ్బులను మేనేజర్, క్లర్క్ పర్యవేక్షణలో కిడ్డీ బ్యాంక్‌లో వేసి లెడ్జర్ బుక్‌లో నమోదు చేస్తారు. జమ అయిన మొత్తం రూపాయల నుంచి వారికి అవసరం ఉన్నంతా విత్ డ్రా చేసి చదువుకు అవసరమైన పెన్, పెన్సిల్, నోట్ బుక్స్ కొనుగోలు చేసుకుంటారు. దీంతో విద్యార్థులు చిన్న నాటి నుంచే బ్యాంక్ పని తీరు ఎలా ఉంటుందో నేర్చుకోవడమే కాకుండా, ప్రతీ రూపాయి విలువ తెలుసుకుని విద్యార్థులు భవిష్యత్ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉపయోగ పడుతుందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కిడ్డీ బ్యాంక్‌లో డబ్బులు జమ చేసుకుంటున్న విద్యార్థులు

ఆర్థిక క్రమశిక్షణ నేర్పేందుకే కిడ్డీ బ్యాంక్

- సముద్రాల వంశీ మోహనాచార్యులు (పాఠశాల ప్రధానోపాధ్యాయులు)



చాలా మంది విద్యార్థులు చిన్న నాటి నుంచే జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. అందుకే పాఠశాలలో జంక్ ఫుడ్ నిషేధం పెట్టాం. దీంతో చిరు తిండ్లు తినకుండా ఆరోగ్యం కాపాడుకుంటారు. దాంతో పాటు ఆర్థిక క్రమశిక్షణ నేర్చుకుంటారు.

పొదుపు ఎలా చేయాలో నేర్చుకున్న

- అర్జున్ తిలక్ (5వ, తరగతి విద్యార్థి)



రోజు ఇంటి నుంచి తెచ్చుకున్న డబ్బులతో ఏదో ఒకటి కొనుక్కొని తినేవాన్ని. పాఠశాలలో ఉపాధ్యాయులు జంక్ ఫుడ్‌ను నిషేధించారు. దీంతో మేమే కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు చేసుకొని రోజు 5, 10 రూపాయలు అందులో జమ చేసుకుంటు న్నాం. ఇప్పుడు నా ఖాతాలో 150 రూపాయలు ఉన్నాయి.

విద్యార్థుల ఆర్థిక భవిష్యత్‌కు పునాది

- హరిణి (పేరెంట్)



డబ్బుల విలువ తెలిసేలా కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. పిల్లలకు ఇది ఒక మంచి అలవాటుగా మారడమే కాకుండా వారి ఆర్థిక భవిష్యత్‌కు పునాది వేస్తుంది. కిడ్డీ బ్యాంక్ ఆలోచన చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు కృతజ్ఞతలు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

జగిత్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరదనీరు రావడం శనివారం కొనసాగింది. ఎగువ ప్రాంతం నుంచి 56,513క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 16వరద గేట్లు ఎత్తి దిగువ గోదా వరిలోకి 47,059క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీ లకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీకి మోయతుమ్మెద వాగు నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా ప్రస్తుతం 4 గేట్ల నుంచి దిగువకు 8వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఎల్‌ఎండి పూర్తి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.645 టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయ తుమ్మెద వాగు నుంచి 7934క్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ నుంచి 320క్యూసె క్కుల నీరు మొత్తం 8254 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్‌ఎండీ 4గేట్ల నుంచి 8వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 254క్యూసెక్కులు మొత్తం 8254క్యూసెక్కుల అవుట్‌ఫ్లో వెలు తోందని అధికారులు తెలిపారు.

రైతులకు తక్షణమే పరిహారం అందించాలి

● సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న పంటలకు తక్షణమే పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జాతీయ నాయకుడు, మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రేకొండ తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను, బ్రిడ్జిలను, రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన 10వేల ఆర్థిక సాయం వెంటనే అందించాలన్నారు. మండలాల్లో యుద్ధ ప్రాతిపదికన సర్వేలు చేయాల న్నారు. అనేక గ్రామాల్లో రోడ్లు, బ్రిడ్జిలు, వ్యవసాయ బావులు దెబ్బతిన్నాయన్నారు. పశువులు మృతచెందిన సంఘటన కలిచి వేసిందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టరు చాడ శ్రీధర్‌రెడ్డి, సీపీఐ జిల్లాకౌన్సిల్ సభ్యుడు బోయినిపటేల్, ముద్రకోల రాజయ్య, పరకాల కొండయ్య, విలాసాగరం అంజయ్య, రాచర్ల రంగయ్య, బోయిని రాజు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చెంచాల రవి, కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న చాడ వెంకటరెడ్డి

కాశీలో వేములవాడ రాజన్న కల్యాణం

వేములవాడటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం కాశీ పుణ్యక్షేత్రంలోని విశ్వనాథ ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీపరాశర వైదిక ఆగమ వేద శాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా వేములవాడ రాజరాజేశ్వర ఆలయ అర్చకులు నమిలికొండ ఉమేష్‌శర్మ, చంద్రగిరి శరత్‌శర్మ, నెమలికొండ రాజేశ్వరశర్మ, మామిడిపల్లి శరత్, వెంకటయ్య ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో ఆలయ ఈవో రమాదేవి, ఏఈఓబి శ్రీనివాస్, సూపర్డెంట్ శ్రీనివాస శర్మ, వి.భాస్కర్ పాల్గొన్నారు.



రాజన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కొనుగోలు కేంద్రాలకు దొంగల బెడద

● రాత్రివేళలో చోరీకి గురవుతున్న ధాన్యం
● చోద్యం చూస్తున్న నిర్వాహకులు

మానకొండూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వరిధాన్యాన్ని తరలిస్తే కాప లాదారులు లేకపోవడంతో రాత్రి వేళలో ధాన్యం చోరీకి గురవుతోంది. దీంతో రైతులు ఎవరికి చెప్పా లో తెలియక లబోదిబోమంటున్నారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో లింగాపూర్, రంగపేట, పచ్చు నూర్, వెల్ది, తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రా లు మహిళల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడేందుకు రాత్రివేళలో నిర్వా హకులు కాపలాదారులను నియ మించాల్సి ఉంటుంది. అవేమీ ప ట్టించుకోకుండా నిర్వాహకులు వది లి వెళ్లిపోతున్నారు. ఇదే అదనుగా భావించి రోడ్డుకు దగ్గరగా ఉండే కొనుగోలు కేంద్రాలను టార్గెట్ చేసి న దొంగలు రాత్రివేళలలో వాహనాల్లో ధాన్యాన్ని తరలించే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో ఐ కేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రంగపేట కొను గోలు కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ వాహనంలో 20సంచుల్లో ధాన్యం నింపుతుండగా దారివెంబడి వెళ్లే వారు గమనించి రైతులకు స మాచారం అందించారు. రైతులు సంఘటనా స్థలా నికి చేరుకొని పట్టుకునే క్రమంలో ఒకరు పారిపో గా మరొకరిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసుల కు అప్పజెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల ని ర్వాహకులు మేల్కొని కాపలాదారులను ఏర్పాటు చేసిధాన్యాన్ని కాపాడాలని రైతులు కోరుతున్నారు.



రంగపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజేతలుగా నిలవాలి

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్స్ కరీంనగర్ ఉమ్మడిజిల్లా జట్లు విశేష ప్రతిభచాటి విజేతలుగా నిలవాలని జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడాచైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న సీనియర్స్ మహిళలు, పురుషుల ఖో-ఖో జట్ల శిక్షణశిబిరాన్ని సుడాచైర్మన్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. కోచ్‌ల శిక్షణ లో క్రీడాకారులు ఖో-ఖోలోని నైపుణ్యాలలో ప్రతిరోజు సాధన చేస్తున్నా రన్నారు. ఈనెల7,8,9తేదీల్లో పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీ ల్లో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన క్రీడాకారులతో కూడిన ఉమ్మడిజిల్లా జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు, జిల్లా సంఘ ఉపాధ్యక్షుడు, ట్రాఫిక్ ఆర్ఐ కుమారస్వామి, రాష్ట్ర డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘ అధ్యక్షుడు డాక్టర్ సురేందర్ రెడ్డి, ఎస్సారార్ కళాశాల ఉపన్యాసకులు, జిల్లా సంఘ ప్రతినిధులు సూర్య ప్రకాశ్, డాక్టర్ ఎ రవీందర్, కట్ట సంతోష్, కరుణాకర్, అశోక్, రాములు, ఖో-ఖో కోచ్‌లు వెంకటేశ్, ఆనంద్, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

ఓదెల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మోడల్ కళాశాలలో ఇంటర్ చదువు తున్న కనగర్తి విద్యార్థి వేల్పుల అక్షయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపి కైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాపోటీలు నిర్వహించగా జిల్లా స్థాయిలో బంగారుపతకం సాధించింది. మోడల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అక్షయ ఎంపికపై కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీడీ కుమారస్వామి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినం దించారు. వరంగల్ జిల్లాకేంద్రంలో రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి.



అక్షయకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ప్రశాంతంగా అర్బన్ బ్యాంకు ఎన్నికలు

● 44.23 శాతం పోలింగ్
● పోలైన ఓట్లు కరీంనగర్‌లో 3,342 ఓట్లు... జగిత్యాలలో 772

కరీంనగర్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్‌బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు భారీ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. కరీంనగర్, జగిత్యాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా సాధారణ ఎన్నికల తరహాలో ఉదయం 7గంటల నుండే బ్యాంకుసభ్యులు (ఓటర్లు) తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఉదయం 7నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించగా 44.23 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్, జగిత్యాలలో కలిపి 9,287 మంది ఓటర్లు ఉండగా కరీంనగర్‌లో 7,272 మంది ఓటర్లకు 3,342 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. జగిత్యాలలో 2,025మంది ఓటర్లు ఉండగా 772 మంది ఓట్లు వేశారు. కరీంనగర్ ఓటర్ల కోసం ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో 24పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి ఒక్కో స్టేషన్‌లో 300మంది ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. జగిత్యాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 7 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేశారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఒక్కోస్టేషన్‌లో ఒక పీవో, ఒక ఏపీవో, ముగ్గురు సిబ్బందితోపాటు మొత్తం 150 మందిని ఎన్నికల కోసం డ్యూటీలు వేశారు. 12 డైరెక్టర్లలో ఎస్సీ, ఎస్టీకి ఒకటి, మహిళలకు రెండు, జనరల్‌కు తొమ్మిది స్థానాలను రిజర్వు చేయడంతో ఎస్సీఎస్టీల కోసం బ్ల్యూ, మహిళలకు పింక్, జనరల్‌కు వైట్ కలర్ మూడు రంగుల్లో ఉన్న బ్యాలెట్‌లో ఒక్కో ఓటరు 12ఓట్లను వినియోగించుకోవాలని, అంతకంటే ఎక్కువ ఓట్లు వేస్తే చెల్లుబాటు కావని, తక్కువ ఓట్లు వేసుకోవచ్చని ఓటర్లకు సూచించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు కరీంనగర్, జగిత్యాలలో ప్రశాంతంగా ముగిసింది. ఆ తర్వాత జగిత్యాల పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలకు పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల సిబ్బందితో తరలించారు.



జగిత్యాలలో ఓట్లు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు

● నాలుగు రౌండ్లలో ఓట్ల లెక్కింపు..

5 గంటల వరకు జగిత్యాల పోలింగ్ బాక్సులు కరీంనగర్‌కు చేరుకోగానే నాలుగు టేబుళ్లపై ఒక్కో బాక్సును ఓపెన్‌చేసి మూడు రంగుల్లోని బ్యాలెట్లను వేరు చేసి 50 చొప్పున బెండళ్లు కట్టి లెక్కింపు ప్రారంభించారు. సాయంత్రం 7.30గంటలకు మహిళాడైరెక్టర్ పోస్టులకు సంబంధించిన ఓట్లను, ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ ఓట్లను ఒక్కో టేబుల్ వేసి వేర్వేరుగా లెక్కింపు ప్రారం భించగా, జనరల్ ఓట్ల కోసం రెండు టేబు ళ్లను వేసి లెక్కించారు.

● నేడో, రేపో చైర్మన్ ఎన్నిక

నాలుగు రౌండ్లలో లెక్కింపు చేపడుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఫలితం తేలనున్నది. గెలుపొందిన 12 మంది డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఆదివారం లేదా సోమవారం ఎన్నికైన డైరెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చైర్మన్ ఎన్నిక నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

● జగిత్యాలలో 36 శాతం పోలింగ్..

జగిత్యాల అర్బన్: కరీంనగర్ కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ ఎన్నికలు జగిత్యాలలో శనివారం ప్రశాంతంగా ముగిశాయి. జగిత్యాలలో 36శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఉదయం పోలింగ్ మందకొడిగాసాగింది. మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ జరగగా రెండు గంటల తర్వాత పోలింగ్ కేంద్రం గేట్‌వేశారు. ఈ ఎన్నికల్లో జగిత్యాల పట్టణంతోపాటు చుట్టుపక్కల మండలాలు గ్రామాలకు చెందిన పలువురు తమ ఓటుహక్కు వినియో గించుకున్నారు. జగిత్యాల అర్బన్‌బ్యాంక్ ఎన్నికల్లో అనేకమంది ఓట్లు గల్లంతు అయ్యాయని బీజేపీ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు అనుమల్ల కృష్ణహరి ఆరోపించారు. బ్యాంక్‌లోని వాటాదారులు మరణిస్తేతప్ప వారిఓట్లు తొలగించకూడదని నిబంధనలు ఉన్నాయన్నారు. అలాంటప్పుడు బతికిఉన్న వారి ఓట్లు ఎందుకు తొలగించారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ఓటరు లిస్టును పరిశీలించి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.



పోలింగ్ కేంద్రం లోపల హెల్ప్ డెస్క్ వద్ద ఓటర్ల సందడి



ఓటు వేసినట్లు సిరా గుర్తు చూపుతున్న ఓటర్లు

ఎన్‌టీపీసీ, కార్పొరేషన్ మధ్య తెగని పంచాయితీ

(5వ పేజీ తరువాయి)

కావడంతో కార్పొరేషన్ వేచి చూసే ధోరణిని అవలంబిస్తుంది. కాగా ఎన్‌టీపీసీ యాజమాన్యం మాత్రం చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ పెండింగ్‌లో ఉన్నందు వల్ల తాము చెల్లింపులు జరుపలేమని, గడువు కావాలంటూ కోరుతుంది. దీంతో పాటు 14శాతం డెవలప్‌మెంట్ చార్జీని కూడా తొలగించాలంటూ పేర్కొంటున్నది. కార్పొరేషన్ నుంచి అనుమ తులు పెండింగ్‌లో ఉండగానే నిర్మాణాల ప్రక్రియ మాత్రం పూర్తికావచ్చింది.

● ఆది నుంచి వివాదాలే...

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఆర్‌ఎఫ్‌సీఎల్, సింగరేణి, జెన్‌కో, ఎన్‌టీపీసీ వంటి ప్రభుత్వరంగ సంస్థలు ఉన్నాయి. ఆర్‌ఎఫ్‌సీఎల్, సింగరేణిలు ఎప్పటికప్పుడు ఫీజులు చెల్లించి నిర్మాణ అనుమతులు తీసుకుంటున్నారు. కానీ ఎన్‌టీపీసీ మాత్రం మొదటి నుంచి వివాదాలకే పోతుంది. ఎన్‌టీపీసీ 7వ యూనిట్, సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ సమయంలో కూడా వివాదాలు నడిచాయి. తరువాత ఒత్తిడి మేరకు ఫీజులు చెల్లించింది. ఇన్ని ప్రభుత్వ రంగ సంస్థలతో వివాదాలు లేకున్నా, ఎన్‌టీపీసీతో నగరపాలక సంస్థకు నిర్మాణాల విషయంలో వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. భారీ ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎన్‌టీపీసీ స్థానిక సంస్థ అయిన కార్పొరేషన్‌తో సమన్వయంతో మెదలడం లేదనే విమర్శలు సైతం ఉన్నాయి.

నోటీసులు ఇచ్చాం... వేచి చూస్తున్నాం...

అదనపు కలెక్టర్, కమిషనర్ అరుణశ్రీ



ఎన్‌టీపీసీకి అనుమతి లేని నిర్మాణాలకు సంబంధించి నోటీసులు ఇచ్చాం. సుమారు రూ.26కోట్ల ఫీజు చెల్లింపులకు సంబంధించి జాప్యం జరుగుతుంది. సీఎల్‌యూ పెండింగ్‌లో ఉందని ఎన్‌టీపీసీ పేర్కొంటున్నది. సమస్య పరిష్కారానికి వేచి చూస్తున్నాం. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.

పారుపల్లి పెద్దచెరువుకు బుంగ

● ఆందోళనలో రైతులు

ముత్తారం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారుపల్లి పెద్దచెరువు చిన్నతూము వద్ద పెద్ద బుంగ ఏర్పడింది. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు సుమారు 4 నుంచి 5 కిలోమీటర్ల లోతులో ఈ బుంగ ఏర్పడింది. దీంతో చెరువు కింద ఆయకట్టు రైతులు ఏప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు నీటిపై ఆధారపడి వేసవిలో వందల ఎకరాల్లో రైతులు సాగు చేస్తుంటారు.



చిన్న తూము వద్ద ఏర్పడిన బుంగ

బుంగ మరింత పెద్దదైతే చెరువుకు గండి పడే ప్రమాదం ఉన్నది. అలాగే ఈ చెరువు నీటిని మత్స్యకారులు చేపలను పెంచుతూ జీవనోపాధి పొందుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు మరమ్మతు చేపట్టాలని రైతులు, మత్స్యకారులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

6 నుంచి పాఠశాలల్లో బోధన పరిశీలించాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలలో ఈనెల 6 నుంచి విద్యాబోధన పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. శనివారం జడ్పీ ఉన్నత బాలికలు, బాలుర పాఠశాలల్లో నిర్వహించిన హైస్కూల్ ఉపాధ్యాయ ప్యానల్ మెంబర్ శిక్షణలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాశాలల్లో 6 నుంచి 10వ తరగతులను పరిశీలించేందుకు 30 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వీరంతా ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి తరగతి గదుల్లో బోధన పద్ధతులను పరిశీలించి, నివేదికలు ఇవ్వాలన్నారు. దాని ఆధారంగా బోధన అంశాలపై సమీక్ష నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. డీఈఓ మాధవి, అధికారి షేక్, పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్

బీటెక్ ఫలితాల్లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి

పెద్దపల్లి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగానికి చెందిన విద్యార్థిని కూనారపు రవళి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీకి అనుబంధం అయిన అన్ని ఇంజనీరింగ్ కళాశాలలో కలిపి రాష్ట్రస్థాయి ర్యాంక్, గోల్డ్ మెడల్ సాధించింది. రవళిని శనివారం మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎడవల్లి నవీన్‌కుమార్, డైరెక్టర్ నవత, ప్రిన్సిపాల్ డాక్టర్ తొడుపునూరి శ్రీనివాస్, విభాగాధిపతి చంద్రగిరి వంశీరాజ్, అకౌంట్స్ ఆఫీసర్ పడాల పవన్‌కుమార్, విద్యార్థిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాలకు ఇది నాలుగవ సారి గోల్డ్ మెడల్ సాధించడం అని తెలిపారు. ప్రస్తుతం బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, డిప్లమా కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ కోర్సులు నిర్వహిస్తున్నావని తెలిపారు. బైపీసీ విద్యార్థుల కోసం బయోటెక్నాలజీ ఫార్మ్యూటికల్ ఇంజనీరింగ్ లాంటి కోర్సులను ప్రవేశపెట్టామని తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

బాల్య వివాహాలను అరికట్టాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో శనివారం బాల్య వివాహ నిరోధక చట్టంపై పలువురు విద్యార్థులకు మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సుచరిత తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టి బాలలను చదువుకునేందుకు తోడ్పాటు నందించేలా ఆలోచన చేయాలన్నారు. అలాగే చిన్న పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా, వాటి అర్థాలను వివరించారు. ఆడపిల్ల చదువు ప్రాముఖ్యత వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. అలాగే మహిళలు, బాలలకు సంబంధించిన రక్షణ ఫోన్ నెంబర్లు 100, 1098, 181, 112 టోల్ ఫ్రీపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, నషాముక్త్ భారత్ కమ్యూనిటీ ఎడుకేటర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలతో రాజకీయం చేయడం తగదు



మాట్లాడుతున్న చైర్మన్లు వెంకన్న, శ్రీనివాస్‌లు

మంథని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలతో రైతుల వరి పంటలు, వడ్లు తడిసి దెబ్బతింటే దానిని సైతం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు రాజకీయం చేయడం తగదని మంథని ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్‌లు ఆరోపించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో తమ ప్రభుత్వం పై ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు రైతులకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకున్నామని, వారికి సౌకర్యాలు కల్పించామన్నారు. రైతుల సౌలభ్యానికి రెండు కొత్త బాయిలర్లు కొనుగోలు చేశామన్నారు. వడ్లను త్వరగా ఆరబెట్టుకోవటానికి ఇవి ఉపయోగపడుతామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వం పై వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. కాంగ్రెస్ నేతలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దపల్లి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలంలోని మారేడుగొండ గ్రామానికి చెందిన హనుమాన్ భక్త మండలి సభ్యులు జగన్నాధపురం గ్రామానికి చెందిన మోటపోతుల రాజేశం, గుర్రాంపల్లికి చెందిన దబ్బాక రాజేందర్‌లు ఇటీవల మృతిచెందగా ఒక్కో కుటుంబానికి శనివారం రూ.5 వేల చొప్పునఆర్థిక సాయం అందించారు. కొంతకాలంగా నిరుపేద కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. తొగరి రాజయ్య, తిరుపతి, సాయిలు, కిట్టు, జక్కుల తిరుపతి , గడ్డం రాజయ్య, లింగయ్య లతో పాటు పలువురు పాల్గొన్నారు.



ఆర్‌జీ-1లో 80శాతం బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియాలో అక్టోబరులో 90శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్టు ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. 3.96లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 3.56లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్టు తెలిపారు. ఆర్‌జీ-1 ఏరియాలో ఇప్పటి వరకు 1912మంది ఉద్యోగులకు మెడికల్ ఇన్‌వాలిడేషన్ కాగా 1648మందికి కారుణ్య నియామకాల ఉత్తర్వులు అందజేశా మన్నారు. జీడీకే 11ఇంక్లైన్‌లో సీ2బీ, సీఎం-1 డీపిల్లరింగ్ ప్యానల్‌ను ప్రారంభించామని, క్యాడర్ స్కీం కింద 42మందికి ప్రమోషన్ ఉత్తర్వులు ఇచ్చామన్నారు. ఆర్‌జీ-1 ఏరియాలో సొంతింటి నిర్మాణానికి రూ.10లక్షల రుణం తీసుకున్న 669మంది ఉద్యోగులకు దాదాపు రూ.3.17కోట్ల వడ్డీని కంపెనీ చెల్లించడం జరిగిందన్నారు.

ఆర్జీ-3లో 65 శాతం...

రామగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ ఉత్పత్తి వివరాలను శనివారం ఆర్జీ-3 ఇంచార్జ్, ఏపీఏ జీఎంలు సిహెచ్. వెంకటరమణ, కొలిపాక నాగేశ్వర్‌రావులు వేర్వేరు ప్రకటనలో వెల్లడించారు. అక్టోబరు నెలకు నిర్దేశించిన 5.70 లక్షల టన్నులకుగాను 3.72 లక్షల టన్నుల లక్ష్యాన్ని సాధించి 65 శాతంలో నిలిచిందన్నారు. ఏపీఏ డివిజన్‌కు నిర్దేశించిన 1.63 లక్షల టన్నుల లక్ష్యానికిగాను 0.14లక్షలు సాధించిందని పేర్కొన్నారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని కార్మికులకు, అధికారులకు సూచించారు.

నేడు సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపు

గోదావరిఖని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో ఆదివారం ఒమెగా హాస్పిటల్ సూపర్ స్పెషాలిటీ వైద్యులచే మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆర్‌జీ-1 అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు న్యూరాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరా లజీ విభాగాలకు చెందిన స్పెషలిస్టు వైద్యులు క్యాంపునకు హాజరవుతారని, సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులు, రిటైర్డ్ కార్మికులు, సీపీఆర్‌ఎంఎస్‌ఈ, ఎన్‌ఈ కార్డు కలిగిన ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఠాణాకు వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలి : సీపీ

అంతర్గాం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తిం చాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ సిబ్బందికి సూచించారు. శనివారం రాత్రి ఆయన ఆకస్మికంగా అంతర్గాం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ లేకపోవడంత ఆయన వెంట ఏసీపీ కూడా ఒక్కరే రావడం గమనార్హం. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సిబ్బందితో ముచ్చటించారు. స్టేషన్ పరిసరాలు, స్టేషన్ భౌగోళిక పరిస్థితులు, సిబ్బంది పనితీరు, స్టేషన్ పరిధిలో అధికంగా నమోదయ్యే కేసుల వివరాలతోపాటు రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులపై ఆయన ఆరా తీశారు.



శైవక్షేత్రాల సమాహారం మంథని

- కార్తీకమాసంలో ప్రత్యేక పూజలు - గోదావరి స్నానం.. ఆలయాల సందర్శన



గౌతమేశ్వర స్వామి

మంథని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గలగల పారే గోదావరి.. మారుమోగే వేద గోషతో మంథని ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుంది. మంథని పట్టణంలో శైవక్షేత్రాలు అధికంగా ఉన్నాయి. ప్రత్యేక పర్వదినాల్లో స్వామికి అభిషేకాలు, అర్చనలు, శివపార్వతుల కల్యాణాన్ని భక్తులు నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం సందర్భంగా మంథనిలోని శివాలయాలు, వాటి విశిష్టతపై ప్రత్యేక కథనం..

గౌతమేశ్వర ఆలయం

గౌతమ మహర్షి తపస్సునకు ప్రత్యక్షమైన శివుడు లింగ రూపంలో గౌతమేశ్వరుడిగా ఇక్కడ కొలువై ఉన్నాడు. గౌతమ మహర్షి తపోభంగం కోసం వచ్చిన మాయ అనే ఆవుపై దర్భ విసురగా ప్రాణాలు విడిచింది. దీంతో గోవు హత్య పాప నివారణకు గౌతమ మహర్షి తపస్సు చేశాడు. గోహత్య పాపం, కరువు నివారణకు గంగను భూమి పైకి విడిచిపెట్టాలని, ఇక్కడే కొలువై ఉండాలని గౌతముడు కోరగా శివుడు వరం ఇచ్చినట్లు ప్రచారంలో ఉంది. గోదావరి ఒడ్డున రామలింగేశ్వర ఉపాలయం ఉంది. కాకతీయుల కాలంలో అభివృద్ధి చేసినట్లు ఆధారాలున్నాయి.

మంథని భిక్షేశ్వరుడు..

కాశీలో మాదిరిగా పడమర వైపు ముఖ ద్వారం ఉన్న ఆలయం భిక్షేశ్వరాలయం. తమ్మిచెరువు కట్ట సమీపంలో ఆలయంలో కాళహస్తి క్షేత్రంలో మాదిరిగా దక్షిణామూర్తి లింగ రూపంలో దర్శనమివ్వడం ప్రత్యేకత. ఈ ఆలయంలో సోమవారం, కార్తీక మాసంలో, శివరాత్రి, ఇతర పర్వదినాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతాయి. భక్తుల కొంగు బంగారంగా భిక్షేశ్వర ఆలయం విరాజిల్లుతుంది.

ఒకే ప్రాంగణంలో శీలేశ్వర-సిద్దేశ్వరులు

ఒకే ప్రాంగణంలో శీలేశ్వర-సిద్దేశ్వరులు కొలువై ఉన్నారు. కాకతీయ కాలంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఇక్కడ మండపాలు, స్తంభాలు, గోపురం, ముఖ ద్వారాలపై చెక్కిన శిల్పకళ సౌందర్యం భక్తులను కట్టిపడేస్తుంది. వందల ఏళ్ళుగా చెక్కు చెదరలేదు. ఆలయం శిథిలావస్థకు చేరుకోగా దాదాపు 150 ఏళ్ళ క్రితం మంథనికి చెందిన లోకే పెద్దరామన్న పునరుద్ధరించారు. అలాగే ఆలయంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల ఆలయం ఉంది. ఆదిశంకరాచార్యులు దేశ సంచారంలో భాగంగా మంథనికి వచ్చినట్లు పురాణాలు తెలియజేస్తున్నాయి. ఆలయంలో ఆది శంకరాచార్యులకు కూడా మందిరాన్ని నిర్మించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం..

శీలేశ్వర-సిద్ధేశ్వర, మహాగణపతిస్వామి ఆలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాల రూపంలో శివదర్శనం కలుగుతుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కొలువై ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాల మాదిరిగానే ఒకే చోట రెండు ఆలయాల్లో ప్రతిష్ఠించారు.




జ్యోతిర్లింగాలు

ఓంకారేశ్వరుడి దర్శనం..

తమ్మి చెరువు పక్కనేఓంకారేశ్వర స్వామి ఆలయం ఉంది. స్వామి వారి లింగాకారం భిన్నంగా ఉంటుంది. స్వామి వెనుక పార్వతి అమ్మవారి ప్రతిమ భక్తులను అలరిస్తుంది. మంథనికి చెందిన వేద పండితుడు గంగానదిలో స్నానం ఆచరిస్తుండగా ఆయన చేతిలోకి లింగరూపంలో ఉన్న రాయి వచ్చింది. గుడిలో ప్రతిష్ఠించి ఓంకారేశ్వరుడిగా నామకరణం చేశారు. ఇదే ఆలయంలో గాయత్రి మాత విగ్రహ రూపంలో దర్శనమిస్తుంది.

సురబాండేశ్వర దర్శనం..

గోదావరినది తీరంలో సురబాండేశ్వరస్వామి భక్తులకు దర్శనమిస్తున్నాడు. కాకతీయులు నిర్మించిన ఆలయంలో ప్రకృతి విధ్వంసం, గోదావరి వరదల కారణంగా దెబ్బతిన్నది. ఆలయానికి వెళ్ళటానికి సీసీ రోడ్డు నిర్మించారు. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నారు.



మంథని గోదావరి నది

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు చెట్ల తొలగింపు

సింగరేణిలో పర్యావరణంపై గొడ్డలి వేటు ● అటవీ, సింగరేణి ఫారెస్ట్ అనుమతులు బేఖాతరు



ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్

రామగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటు కోసం పర్యావరణం విధ్వంసం జరుగుతుంది. సింగరేణిలో వందల హెక్టార్లలో చెట్లను తొలగిస్తున్నారు. చెట్ల నరికివేతలో ఏకపక్ష నిర్ణయాలను తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సింగరేణికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్పొరేట్ ఫారెస్ట్ విభాగం అనుమతి అవసరం లేకుండానే వ్యవహరిస్తున్నారు. సింగరేణి అన్ని ఏరియాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం సుమారు 20 నుంచి 50సంవత్సరాల పైబడిన చెట్లను తొలగిస్తున్నారు. ఆర్జీ-3 డివిజన్‌లో సుమారు 100 ఎకరాలలో సోలార్ ప్లాంట్ కోసం చెట్లను తొలగించారు. సెంటినరీకాలనీకి సమీపంలో 17 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. వందల వృక్ష లను కాంట్రాక్టర్ తొలగిస్తున్నారు. సింగరేణి ఫారెస్ట్ విభాగం వ్యయప్రయాసాలతో రుద్రంపూర్ వద్ద దట్టమైన అడవిగా మారిన ప్రాంతాన్ని సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటుకు చెట్లను తొలగించారు. అలాగే గోలేటిలో సుమారు వంద ఎకరాల్లో సింగరేణి పెంచిన వనా లను ధ్వంసం చేశారు. మంద మర్రిలో వంద ఎకరాల్లో జామా యిల్ తోటలను తొలగించి సోలార్ పనులకు శ్రీకారం చుట్టారు. రామ గుండం రీజియన్‌లో 20 ఎకరాల్లో చెట్ల తొలగింపు చేపట్టారు. భూపాల్ పల్లిలో గతంలో 40 ఎకరాల విస్తర్ణంలో గల చదును చేసి సోలార్ ప్లాం ట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అదనంగా మరో 45 ఎకరాలలో చెట్లను తొలగించి సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పర్యావరణ సమతుల్య తకు పెద్దపీట వేసే సింగరేణి విధ్వంసానికి కారణం అవుతుంది. కాలనీకి సమీపంలో సోలార్‌ప్లాంట్‌ల ఏర్పాటు చేయడంతో రేడియేషన్ ప్రభావం ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 8వందల ఎకరాల్లో చెట్ల తొలగింపు చేపట్టారు.



నరికిన వృక్షాలు

టాస్క్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యోగులను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన టాస్క్ సెంటర్‌ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఇటీవల టాస్క్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్ మేళాలలో ఉద్యోగాలు పొందిన పలువురిని ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టాస్క్ సెంటర్‌లో పలు కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రైవేటు కంపెనీల ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి, మంచి ప్యాకేజీతో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో డిగ్రీతో పాటు పలు ప్రొఫెషనల్ స్టడీ ఉత్తీర్ణత సాధించిన వారు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ తీసుకోవడం ద్వారా మంచి ప్లేస్‌మెంట్ లభించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కోఆర్డినేటర్ కౌసల్య, ఉపాధి కల్పనాఅధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న నాయకులు

మంథనిరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ గ్రామ పంచాయతి కార్యాలయం భవన నిర్మాణానికి సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ శనివారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజురయ్యాయని తెలిపారు. మంత్రి దుద్దిళ్ళ శ్రీదర్‌బాబుతోనే ఖానాపూర్ గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎల్‌మడుగును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడంలో భాగంగా రుద్రపాదల వరకు రూ.7 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్‌ను మాజీ ఎంపీపీ నారమల్ల లక్ష్మీరాజం సన్మానించారు. మాజీ సర్పంచ్‌లు సేమంతుల ఓదెలు, దోరగొర్ల శ్రీనివాస్, నాయకులు తోట సుధాకర్, బాస అశోక్, మంథని సమ్మయ్య, పెగడ రాజు, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

5న సత్యనారాయణ స్వామి వ్రతాలు

ఎలిగేడు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాకల్‌దేవ్ పల్లి-రాములపల్లిలోని నాగలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ఈ నెల 5న బుధవారం 10.30 నుంచి సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. వ్రతంలో పాల్గొనే వారు అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు 9949841929, 8790129252, 9700401046, 9502629489. పూజా సామాన్లు భక్తులు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని కమిటీ బాధ్యులు, నిర్వాహకులు పేర్కొన్నారు.

5న గౌతమేశ్వరస్వామి కల్యాణం

మంథని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 5న గోదావరినది తీరంలో గౌతమేశ్వరస్వామి ఆలయంలో స్వామి, పార్వతీ మాతల కల్యాణాన్ని, జ్వాలాతోరణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సాయిశర్మ, గణపతిశర్మలు శుక్రవారం తెలిపారు. భక్తులు, దాతలు సహాయాన్ని అందించి విజయవంతం చేయాలని కోరారు. 9885897957, 8897314568 గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా పంపించాలని కోరారు.

విగ్రహ ప్రతిష్ట సందర్భంగా హోమాలు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని పాండవుల గుట్టపై నిర్మించిన అయ్యప్ప స్వామి, గణపతి, సుబ్రహ్మణ్య, నాగేంద్ర, మాలి కాపు రత్తమాంబ, నవ గ్రహ, పంచముఖ ఆంజనేయ స్వామిల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం వైభవంగా కొనసాగాయి. అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠలో వేదపండితులచే మహాగణపతి పూజ, పుణ్యావ చనం, వాస్తు, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేక కార్యక్రమాలు నిర్వహిం చారు. అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం

మంథనిరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరయ్యపల్లి ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పులి సదానందం, ఉపాధ్యక్షుడిగా సుంకరి దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా బొల్లి ప్రసాద్, సహాయ కార్యదర్శిగా బొల్లి రవి, కోశాధికారిగా బీర్క సదానందం, కార్యవర్గ సభ్యులుగా సుంకరి సదాశివ్, జోడు రాజు, ముఖ్య సలహాదారులుగా బీర్క లక్ష్మన్, బీర్క రాము, చింతకింది సత్తయ్య, బీర్క సాగర్‌లను ఎన్నుకున్నారు.

గాయపడిన వ్యక్తిని పరామర్శించిన కమిషనర్

సుల్తానాబాద్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జవహర్‌నగర్‌లో కోతుల దాడిలో గాయపడిన బాధితుడు ఎల్లె మల్లేశంను శనివారం మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ పరామర్శించారు. దాడి జరిగిన తీరును తెలుసుకున్నారు. కోతులు ఒకేసారి మూకుమ్మడిగా దాడి చేయగా, వాటిని తరిమేందుకు ప్రయత్నించగా దాడి చేశాయని వివరించారు. త్వరలోనే కోతులను తరలించేందుకు చర్యలు చేపడుతామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. కోతులను తరలించేందుకు ప్రత్యేకంగా వాటిని పట్టుకునే బృందాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

నేడు ధర్మారంలో మంత్రి అడ్లూరి పర్యటన

ధర్మారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పర్యటించనున్నట్లు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ తెలిపారు. మండలంలోని మేడారంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. తుఫాన్ ధాటికి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తారు.

ఎస్‌టీయూ మండల అధ్యక్షుడిగా రాజశేఖర్



మంథని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్‌టీయూ మండల కార్యవర్గాన్ని ఈదుపల్లి నర్సింహారావు అధ్యక్షతన శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ములకల్ల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా మడ్డి రాజు, జిల్లా కౌన్సిలర్లుగా శేషాద్రి, చంద్రశేఖర్, శ్రీనివాస్, నరేష్‌లు ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ సమక్షంలో జరిగిన ఎన్నికకు ఎన్నికల అధికారిగా వొడ్నాల సహేందర్ వ్యవహరించారు.

హైదరాబాద్ తరలివెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ధర్మారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై జరిగిన దాడికి నిరసనగా మంద క్రిష్ణ మాదిగ పిలుపు మేరకు హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఇటీవల ఎన్నికైన ఎమ్మార్పీఎస్ కమిటీ సభ్యులు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిశారు. బొల్లి స్వామి, రాజేశం, మల్లేశం, కాంపెల్లి పోచయ్య, తాళ్లపల్లి మల్లేశం, సతీష్ పాల్గొన్నారు.